క్లుప్తంగా

పాఠశాలలో నమూనా ఓటింగ్


మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

బషీరాబాద్: స్థానిక సంస్థలకు నిర్వహించే ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు మాక్ పోలింగ్ ద్వారా అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం హీర్యానాయక్ పర్యవేక్షణలో విద్యార్థులతో మాక్ పోలింగ్ చేయించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎంపై ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ కొనసాగించారు. మొత్తం ప్రక్రియను నిజమైన ఎన్నికల లాగే నిర్వహించారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్ ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

వన నర్సరీల ఏర్పాటు


దౌల్తాబాద్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఏపీఓ

దౌల్తాబాద్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా వన నర్సరీలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి గ్రామ పంచాయతీలో 10వేల మొక్కలను పెంచడానికి టార్గెట్ నిర్దేశించారు. ఇప్పటికే నర్సరీలకు మట్టిని తరలించారు. కొన్ని పంచాయతీల్లో కవర్లలో మట్టిని నింపారు. వచ్చే ఏడాదికి గాను నర్సరీల్లో మొక్కలను పెంచడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీఓ రంజిత్‌కుమార్ మంగళవారం తెలిపారు.

సుల్తాన్‌పూర్‌లో పశు వైద్య శిబిరం


పశువుకు ఇంజక్షన్ చేస్తున్న వైద్య సిబ్బంది

దౌల్తాబాద్: కృత్రిమ గర్భధారణ ద్వారానే మేలురకపు పశుసంతతి పెంపొందించుకోవాలని వెటర్నరీ డాక్టర్ వరలక్ష్మి సూచించారు. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో మంగళవారం పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గేదెలు చలికాలంలో ఎక్కువగా ఎదకు వస్తాయని రైతులు సకాలంలో ఈ విషయాన్ని గుర్తించి సమీపంలోని పశువైద్యశాలలో లేక గోపాలమిత్రల ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో వీఎల్ఓ సత్యనారాయణరెడ్డి, గోపాలమిత్రలు తదితరులున్నారు.

ఎస్‌డీఎఫ్ నిధులతో అభివృద్ధి


స్లాబు పనులు ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి తదితరులు

మోమిన్‌పేట: ఎస్‌డీఎఫ్ నిధులతో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎస్‌డీఎఫ్(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) రూ.20లక్షలతో నిర్మిస్తున్న కాస్లబాదు నందివాగు కల్వర్టు పైకప్పు స్లాబును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంఘం ప్రారంభోత్సవానికి తరలిరావాలి

షాబాద్: ఈ నెల 14వ తేదీన తెలంగాణ కురుమ సంఘం భవన ప్రారంభోత్సవానికి కురుమలందరూ అధిక సంఖ్యలో తరలిరావాలని కురుమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాదయ్య, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీన నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి కురుమ సంఘ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి కురుమలు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

నాలుగు నెలలుగా వేతలు

- వేతనాలు అందక గ్రామ పంచాయతీ కార్మికుల అవస్థలు
- ఆందోళన బాటలో సిబ్బంది


పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన కార్మికులు


పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్: గ్రామాల్లో చెత్తను సేకరిస్తూ ప్రతి వీధిని శుభ్ర పరుస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నా గ్రామ పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు అందక అర్థాకలితో అలమటిస్తున్నారు. అప్పులు తెచ్చుకుని కాలం వెళ్లదీసే దుస్థితి ఏర్పడిందని మండలంలోని పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీపీ కార్యాలయం ఎదుట నిరసన

మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో 150 నుంచి 160 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో సిబ్బందికి మూడు నుంచి 5 నెలల వరకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన చెందుతున్నారు. ఈ నెలలో 20 రోజులు గడిస్తే దౌల్తాబాద్ గ్రామ పంచాయతీకి నాలుగు నెలల వేతనాలు అందాలన్నారు. జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని గ్రామపంచాయతీ కార్మికులు కంటతడి పెట్టుకుంటున్నారు. దీంతో దౌల్తాబాద్ పంచాయతీ కార్మికులు మంగళవారం కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. జీతాలు రాక ఇల్లు గడవడమే కష్టంగా మారిందని లబోదిబోమన్నారు.

అధిక శ్రమ

గ్రామ పంచాయతీ కార్మికులు గ్రామాల్లో నిత్యం చెత్త సేకరణ, వీధులను శుభ్రం చేయడం, తాగునీటి సరఫరా, మురుగు కాల్వల పరిశుభ్రత, వీధిదీపాల నిర్వహణ, డంపింగ్‌యార్డులు, నర్సరీల్లో పనులు చేయడంతో పాటు గ్రామ రహదారుల వెంట నాటిన మొక్కలకు నీటి ట్యాంకర్ల ద్వారా నీరు పెట్టడం ఇలా అన్ని రకాల పనులు చేస్తున్నారు. ఇంత శ్రమ చేసినా తమకు గ్రామ పంచాయతీల్లో వేతనాలు చెల్లించేందుకు నిధులు లేవని అధికారులు చెప్పడంపై కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు వేతనాలు నెలనెలా వేతనాల అందే విధంగా చొరవ చూపాలని కోరుతున్నారు.

ప్రతి పని చేస్తాం



నాలుగు నెలలుగా వేతనాలు అందడంలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీలోని ప్రతి పనులు చేస్తాం. జీతాలు లేక పోయేసరికి పూట గడవడం కష్టంగా ఉంది. జీతాలు అందించే విధంగా అధికారులు చొరవ చూపి ఆదుకోవాలి.

– సాయిదాసు, జీపీ కార్మికుడు, దౌల్తాబాద్

చర్యలు తీసుకుంటాం



ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత ఉంది. దీంతో వేతనాలు అందించడం ఆలస్యమవుతుంది. గ్రామపంచాయతీ కార్మికులకు త్వరలోనే వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకుంటాం. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం.

– శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

యువతకు సాయన్న ఆదర్శం


పరిగి: సాయన్న విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: పండుగ సాయన్న జీవిత చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సామాజిక విప్లవకారుడు పండుగ సాయన్న వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి బహుజన బంధువుగా సాయన్న పేరుగాంచారన్నారు. గ్రామాల్లో అన్నదానాలు, పెళ్లిళ్లు చేయడం వంటి సామాజిక కార్యక్రమాలు చేస్తూ నిజాంపై పోరాటం చేశారన్నారు. పండుగ సాయన్న జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, నాగేష్, మాణిక్యం, వెంకటయ్య, సత్యనారాయణ, తాహేర్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో..

కొడంగల్ రూరల్: పండుగ సాయన్న వర్ధంతిని పలు ప్రజాసంఘాలతో ముదిరాజ్ సంఘం నేతలు మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనను ఎదిరిస్తూ, అధికారులను ప్రశ్నించిన ధీశాలి సాయన్న అని కొనియాడారు.


కొడంగల్ రూరల్: సాయన్న వర్ధంతిలో ప్రజా సంఘాల నాయకులు

కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, శేఖర్, కాశప్ప, కుర్మయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దొరలను దోచి.. పేదలకు పంచి

కుల్కచర్ల: మండల కేంద్రంలో పండుగ సాయన్న వర్ధంతిని ముదిరాజ్ సంఘ నేతలు నిర్వహించారు. బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవను కొనియాడారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ... పేదల కుటుంబాల్లో సంతోషాన్ని చూడాలన్న సంకల్పంతో దొరల దగ్గర ఉన్న సంపదను దోచి పేదలకు పంచిన మహోన్నత వ్యక్తి పండుగ సాయన్న అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటయ్య, రవీందర్, కొండయ్య, లక్ష్మణ్, చంద్రయ్య, నాయకులు మైపాల్, ఆనందం, శ్రీశైలం, కె.మైపాల్, వేణు, వెంకటేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'పార్టీకి పూర్వ వైభవం తెస్తాం'

యాలాల: టీడీపీకి పూర్వ వైభవం తీసుకువస్తామని ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు అన్నారు. మంగళవారం దేవనూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్యగౌడ్ టీడీపీలో చేరిక సందర్భంగా మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల పార్టీగా టీడీపీకి గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున అభ్యర్థులు పోటీలో ఉంటారన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తల పేరుపై రూ.5 లక్షల పాలసీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల కన్వీనర్ వెంకటేష్, రాఘవులు, హన్మంతు, జావీద్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

బొంరాస్‌పేట: గ్రామీణ పేదలకు సీఎం రేవంత్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దాసరి చంద్రప్ప అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రేగడిమైలారంలో గ్రామపంచాయతీ వద్ద కోతి వెంకటప్ప వైద్యసేవలకుగాను సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష చెక్కును ఆయన అందజేశారు. నిరుపేదల అత్యవసరంగా సీఎంఆర్ఎఫ్ నిధులు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామాధ్యక్షుడు కుమ్మరి గుండప్ప, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, చిన్న నర్సింలు, సాయిలు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న నాయకులు

'తెలంగాణ తల్లి'కి క్షీరాభిషేకం


అనంతగిరి: తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అనంతగిరి: తెలంగాణ తల్లి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయం చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం వికారాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ధారూర్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు గోపాల్, రామస్వామి, అనంత్‌రెడ్డి, రాములు, కోఆప్షన్ సభ్యుడు షకీల్, నాయకులు పురుషోత్తంరెడ్డి, సురేష్, పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతిపై దెబ్బ

మోమిన్‌పేట: తెలంగాణ సంస్కృతికి చిహ్నమైన బతుకమ్మను తీసేసి తెలంగాణ తల్లిని.. కాంగ్రెస్ తల్లి చేశారని మండల బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు తిరుపతిరెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరాములు, సందీప్, మహిపాల్‌రెడ్డి, శేఖర్, వెంకట్‌రెడ్డి, మైబల్లి, ఖాలేద్, అనూప్‌రెడ్డి, శ్రీనివాస్, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.


మోమిన్‌పేట: పార్టీ కార్యాలయంలో..

పరిగి: సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న వికృత చేష్టలకు ప్రజలు నవ్వుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లినే మార్చేశారన్నారు. సీఎం కక్షపూరితంగా వ్యవహరిస్తూ తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బస్వరాజ్


దుద్యాల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘం నాయకులు

కొడంగల్ రూరల్/దుద్యాల్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని బీసీ సంఘం కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దుద్యాల్ తహసీల్దార్ కిషన్, కొడంగల్ డీటీ అనితకు మంగళవారం వేర్వురుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో దాదాపు 16 లక్షల 75 వేల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భీమరాజు, నాయకులు బలరాం, చంద్రశేఖర్‌గౌడ్, హన్మయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భవానీమాత ఉత్సవాలు

పూడూరు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని డీసీసీ కార్యదర్శి పెంటయ్య, సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్‌పటేల్‌లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నబండ తండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన భవానీమాత, సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి, అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, తాజోద్దీన్, సతీష్ పంతులు, బీజేపి మండల అధ్యక్షుడు రాఘవేందర్, మాజీ సర్పంచ్ గోపాల్, సుభాన్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు, నాయకులు

ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం



మూతబడిన ఎమ్మార్సీ ఆఫీస్

సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తాండూరు రూరల్: మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం వేసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. తమ డిమాండ్లను సాధించుకోవడానికి ఉద్యోగులు నాలుగు రోజుల నుంచి జిల్లా కేంద్రంలో సమ్మె చేపట్టారు. దీంతో మంగళవారం తాండూరు ఎమ్మార్సీ కార్యాలయంలో పని చేస్తున్న సీఆర్‌పీలు, ఎంఐఎస్, డీఈఓ, ఐఆర్‌పీ, మెసెంజర్లు వికారాబాద్‌కు వెళ్లారు. ఇది వరకే సిబ్బంది ఎంఈఓకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ నేపథ్యంలో వివిధ పనుల నిమిత్తం ఎమ్మార్సీ కార్యాలయానికి వస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ కాలుష్య కారకమైన ప్లాస్టిక్‌ను నిషేధించాలని చౌడాపూర్ పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. మంగళవారం జీవమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై చౌడాపూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడటంతో అనారోగ్య సమస్యలు పెరిగిపోతాయన్నారు. ప్రస్తుతం భూమిలో కరిగే బయో ప్లాస్టిక్ అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో జీవమిత్ర ఫౌండేషన్ కోఆర్డినేటర్స్ సాయిభరత్‌కుమార్, ఉత్తమ్‌కుమార్, నాయకులు అశోక్, వెంకటేష్, యువజన సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో జీవమిత్ర సంస్థ ప్రతినిధులు

ఆశవర్కర్ల ముందస్తు అరెస్టు

మొయినాబాద్: ఆశవర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం తలపెట్టిన హెల్త్ డైరెక్టర్ కార్యాలయం ముట్టడిని పోలీసులు అడ్డుకున్నారు. మంగళవారం ఉదయమే పోలీసులు ఆశవర్కర్లను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారు. బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆశవర్కర్లకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశవర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. వారికి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రవూఫ్, వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఆశవర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా డిమాండ్ చేశారు. ఆశవర్కర్ల సమస్యలు, డిమాండ్ల పరిష్కారం కోసం మంగళవారం చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా తమను అరెస్ట్ చేయడం సమంజసం కాదన్నారు. ఎన్నికల సమయంలో ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం


అనంతగిరి: పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

- వికారాబాద్ ఎంపీడీఓ వినయ్‌కుమార్
- సీఎం కప్ పోటీలు ప్రారంభం

అనంతగిరి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని వికారాబాద్ ఎంపీడీఓ వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండల స్థాయి సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్–14, అండర్–17 బాలబాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ దయానంద్, పీఈటీలు, అధికారులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో షురూ..

బొంరాస్‌పేట: విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహించారని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అట్టహాసంగా సీఎం కప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపీడీఓ వెంకన్నగౌడ్, ఎంఈఓ హరిలాల్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కబడ్డీ అండర్–17 బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో కేజీబీవీ, ద్వితీయ స్థానంలో చౌదర్‌పల్లి, కబడ్డీ బాలుర విభాగంలో ప్రథమస్థానంలో మేడిచెట్టుతండా, ద్వితీయ బొంరాస్‌పేట, ఖోఖో బాలికల విభాగంలో ప్రథమస్థానం బొంరాస్‌పేట, ద్వితీయ కేజీబీవీ జట్లు సాధించగా, ఖోఖో బాలుర విభాగంలో ప్రథమ దుద్యాల, ద్వితీయ బొంరాస్‌పేట జట్లు నిలిచాయి.


బొంరాస్‌పేట: కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచిన కేజీబీవీ జట్టు

దోమలో..

దోమ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలు ఘనంగా జరుగుతున్నాయి. మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొని వివిధ క్రీడల్లో పాల్గొన్నారు. విజేతలకు ఎంపీడీఓ మహేశ్‌బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డితో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై మక్కువ చూపాలి

మోమిన్‌పేట: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై మక్కువ చూపాలని మండల ప్రత్యేకాధికారి సదానందం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సీఎం కప్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటాలని సూచించారు.


దోమ: విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

బషీరాబాద్‌లో..

బషీరాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభమైనట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. జిల్లా స్థాయిలో నిర్వహించనున్న పోటీలకు మండల స్థాయిలో ప్రతిభ చూపే వారిని ఎంపిక చేయాలని నిర్వాహకులకు సూచించారు.

నేటి నుంచి పోటీలు

కొడంగల్ రూరల్: సీఎం కప్ పోటీలను బుధవారం నుంచి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మున్సిపల్ స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉషశ్రీ, ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ సమావేశం హాలులో టోర్నమెంట్‌కు సంబంధించి వివరాలను అందించారు. మండల స్థాయి పోటీల ఎంపికకు 12వ తేదీన జెడ్పీహెచ్ఎస్ బాలుర కొడంగల్‌లో క్రీడాకారులు 3గంటల వరకు వివరాలను అందించాలని తెలిపారు. సీఎం కప్ కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని వారు రావాలని చెప్పారు.

విజయవంతం చేయండి

బంట్వారం: సీఎం కప్ మండల స్థాయి పోటీలను విజయవంతం చేయాలని ప్రత్యేక అధికారి కమలాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ క్రీడలపై సమావేశం నిర్వహించారు. 12వ తేదీన మండల స్థాయిలో క్రీడల పోటీలు నిర్వహిస్తామన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో క్రీడలు నిర్వహిస్తారని చెప్పారు.